# డియర్ డాడీ!

-కె. మంజులత

ప్రియమైన నాన్నగారికి,

ఏమని వ్రాయమంటారు? ఈ విషయం కూడా నేనే చెప్పాలా అనుకుంటున్నారా? ఏమిటో చాలా చాలా చెప్పాలనే వుంది. కానీ ఎలా మొదలుపెట్టాలో తెలియడంలేదు. చూసారా! ఈ పదాలన్నీ ఎటో పారిపోతున్నాయి నన్నొదిలేసి. పోనీ చిన్నప్పుడెప్పుడో నేర్చుకున్న లెటర్ రైటింగ్‌లోలాగా క్షేమ సమాచారాలతో మొదలుపెడదామంటే నాకు అంత ఫార్మల్‌గా రాయడం చాతకావడంలేదు.

అలవాటులేని పనులు చేస్తున్న నన్ను చూసి ఆశ్చర్యపోతూ వుండుంటారు. నాకూ అయిష్టమైన పనయినా ఉత్తరం వ్రాయడమే ఉత్తమ మార్గంగా తోస్తోంది. ఎందుకంటే ఈ విషయం నేను మీ ఎదుటపడి చెప్పలేను నాన్న. నేను చేస్తుంది తప్పని నాకనిపించకపోయినా మీకు ఎదురుపడే ధైర్యం కోల్పోయాను. ఏంటో ఏ అనాలిసిస్‌కి అందని ఏదో ఎక్సైట్‌మెంట్. నాకు నేను వేసుకునే ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి ఏమిటీ పిరికితనమని. కానీ నిజంగా పిరికితనం కూడా కాదేమో! సంస్కృతి నేర్పిన బిడియమై వుంటుందేమో! ఏదైనాకానీ మీరే చెప్పాలి. మీరు నన్ను అర్థం చేసుకునే వ్యక్తి. అందుకే నా అనుభూతికి అర్థం కూడా మీరే చెప్పాలి.

మీరే చెప్పినట్లు కాలంతోపాటు విలువలూ, అభిప్రాయాలు, ఆలోచనలు కూడా మారుతూ వుంటాయి. అందుకేనేమో ఎప్పుడూలేనిది నాకు అమ్మ వుంటే బావుండేదన్పిస్తుంది. అంటే మీరేదో తక్కువ చేసారని కాదు. ఎప్పుడో పోయిన అమ్మ కోసం తపన అది. కొన్నింటికి అమ్మే కావాలని నాకూ ఈమధ్యే తెలుస్తోంది నాన్నా. నాకెప్పుడూ ఏ విషయమైనా మీకు చెప్పందే నిద్ర పట్టేది కాదు. కానీ అలవాటులేని విషయం నాన్నా. అందుకే ఈ ఉపోద్ఘాతాలూ, ఉదాహరణలు.

నేనెప్పుడూ అనుకుంటుంటాను కదా. మీలాంటి తండ్రి వుండడం నిజంగా నా పూర్వజన్మ సుకృతమని. పిల్లలకి జీవితాన్నివ్వడం సహజమే. దానికి పెద్ద ప్రయత్నాలు అవసరంలేదు. కానీ అందమైన జీవితాన్ని ఇవ్వడమే గొప్ప విషయం. మీలో నేను గర్వపడే విషయం. మంచి చెడులు తెలుసుకోలేని వయసులో ఆసరా ఇచ్చి ఏది మంచో, ఏది చెడో ఎనలైజ్ చేసి ఆలోచించే విచక్షణా జ్ఞానాన్నిచ్చి ఏ అభిప్రాయాలైనా అరమరికలు లేకుండా వ్యక్తపరచనిచ్చి జీవితంమీద అవగాహన, ప్రేమ పెంచే మీలాంటి పేరెంట్స్ అందరికీ ఎందుకుంటారు నాన్నా. అందుకే నేను అదృష్టవంతురాల్ని. నేను తప్పటడుగులు వేయననే మీ నమ్మకానికి పునాది మీరు వేసిందే. అందుకే మీ వ్యక్తిత్వం నాలో హిమాలయాలంత ఉన్నతం. నాపై మీ ప్రేమ సముద్రంలా అనంతం.

నేను మీరు మలచిన శిల్పాన్ని. మీరు పోసిన ప్రాణాన్ని. మీ ఆలోచనలకు, ఆదర్శాలకు ప్రతి రూపాన్ని. నేను అనేదంతా మీదే. అందుకే నాన్న నేనెప్పుడూ ఏ నిర్ణయంలోనైనా మీపై ఆధారపడడానికే ఇష్టపడతాను- పైకి వ్యక్తపరచకపోయినా. ఎంత స్వంత నిర్ణయాలు తీసుకోగలిగే శక్తి నాకు మీరిచ్చినా అంతర్లీనంగా మీమీద ఆధారపడే తత్వం నాలో ఏమూలో మిగిలే వుందనిపిస్తుంది. నేనిలా అంటే మీరు బాధపడతారని తెలుసు. వెన్నెముక లేని వ్యక్తిత్వాన్ని వ్వడానికా ఇంత కష్టపడ్డానని. కానీ నిజంగా చెప్పాలంటే కొన్ని నిర్ణయాల్లో మీలాంటి వ్యక్తుల సహకారం చాలా అవసరం నాన్నా. ఎవరి సంగతో తెలీదు. కానీ మీరు మాత్రం ఒక తండ్రిగా నా దృష్టిలో చాలా విశిష్టమైన వ్యక్తి. ఈ పదం నా దృష్టిలో మీ ఉన్నతిని వ్యక్తం చేయలేదని తెలుసు నాన్నా. అంతకంటే మంచి పదమేదీ దొరకలేదు. నేనేమో ఎంత కష్టపడుతున్నానని నా భావమంతా మీకు చెప్పేయాలని. అయినా మీరర్థం చేసుకుంటారని నాకు తెలుసు. ఎందుకంటే ఏమి మాట్లాడకపోయినా నేనేంటో మీకు తెలుసు కనుక.


ఏదో సందర్భంలో మీరన్న మాటల్ని నేను మర్చిపోలేదు నాన్నా. మీరన్నారు కదా-

"చూడు చిన్నా! కొత్తగా పెళ్లయిన వాళ్లని గుడికెందుకు పంపిస్తారో తెలుసా? అక్కడ వుండే శృంగార భంగిమలు చూసి శృంగారం కూడా పవిత్రమైన విషయమేనని అర్థం చేసుకుంటారని, వాళ్ళ సంకోచాలన్నీ వదిలేసి హాయిగా జీవితం గడపగలుగుతారని. అలాగే ఏ విషయమైనా సున్నితంగా, హృద్యంగా చెప్పాలి అని ఆలోచిస్తే అనిపిస్తుంది. మీరే సందర్భంలో అలా చెప్పినాగాని, అంత వివరంగా, ఫ్రాంక్‌గా ఎంతమంది తండ్రులు చెపుతారు తమ పిల్లలకి అని.

అసలు విషయం మాత్రం నేను చెప్పలేదు చూశారా. ఆ విషయమే ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను నాన్నా. నేనొక వ్యక్తిని ప్రేమిస్తున్నానని వ్రాద్దామంటే ప్రేమ కబుర్లు వినీ వినీ, టీనేజ్ ప్రేమలు చూసీ చూసీ ఆ పదం మీదే విలువ తగ్గిపోయింది. ఏదేమైనాకానీ రోజురోజుకీ అతని ప్రభావం నా జీవితంలో పెరిగిపోతోంది. చేసే ప్రతి పనీ అతనికి నచ్చుతుందా లేదా అని ఆలోచించడం, అతని ఆనందంలో నా ఆనందం వెదుక్కోవడం, పుట్టి బుద్దెరిగినప్పటినుంచీ ఎవరిమీదా చూపించని కేరింగ్ అతని మీద చూపించడం, నా కెరీర్‌ని, మిమ్మల్ని తప్ప ఎవర్నీ కేర్ చేయని నేను అతన్ని కూడా మీతో సమానంగా చూడడం ఏమిటిదంతా? ఎందుకోగానీ అతన్నిగూర్చిన ఆలోచనలన్నీ నాకెంతో అపురూపంగా అన్పిస్తాయి. అతనిపై నా ఈ ఇష్టం ఎప్పటినుంచో వున్నట్టు నాకతనెంతో సన్నిహితుడైనట్టు అన్పిస్తుంటుంది.

అతనిలో గొప్పేమిటని మీరు నన్ను ప్రశ్నిస్తారని తెలుసు. ప్రత్యేకంగా చెప్పడానికంటూ ఏ గొప్పతనాలు లేవుగానీ అతని ప్రతి విషయం నాకెందుకో గొప్పగా అన్పిస్తుంటుంది. నా విషయంలో అతను అందరి లాంటివాడు కాదు. బహుశా ప్రేమించిన ప్రతివాళ్లూ ఇలాగే అనుకుంటారేమో నాకు తెలీదు. కానీ అతనొక భిన్నమైన వ్యక్తిగా, చాలా సిన్సియర్‌గా అన్పిస్తాడు. మీకు నవ్వు వస్తోంది కదూ. ఆపోజిట్ సెక్స్‌లో వుండే ఆకర్షణ అనుకుంటున్నారు కదూ.

అందుకు నేను ఒప్పుకోను నాన్నా. కేవలం



మగవాడైనంత మాత్రాన నేనతన్ని ఇష్టపడడం సాధ్యంకాదు. అలా అయితే నాకు పరిచయమున్న మగవాళ్లెందరో వున్నారు. ఇతనన్ని విషయాల్లో నన్నర్థం చేసుకున్న వ్యక్తిగా అన్పిస్తాడు. చాలామందిలో లేని వ్యక్తిత్వం ఇతనిలో వున్నట్లు అన్పిస్తుంది. మరి నాకే అలా అన్పిస్తుందేమో. అయినా ఇష్టమైంది నాకు కాబట్టి నాకన్పిస్తే చాలుకదా. అయినా ఎవరో ఇచ్చిన సర్టిఫికెట్స్‌ని నేనెప్పుడు కేర్ చేసానని. మన జీవితం మన ఆనందం కోసమేగానీ ఎవరో మెప్పుకోసం కాదుకదా. ఎనీహౌ నా విషయంలో అతను చాలా మంచివాడు. నా విషయంలో అని ఎందుకంటున్నానంటే మంచితనం విషయంలో ఎవరి వ్యాఖ్యానాలు వాళ్లకుంటాయి కదా. అతను మీకూ నచ్చుతాడని నా నమ్మకం. ఎందుకంటే నాకు తెలిసిన మీరు, నా తండ్రి కుమక.

ఇంకో విషయం. నాకు ముందునుంచే ఇష్టం వున్నా అతనే ముందు ప్రపోజ్ చేసాడు. అతనికి నాతో లైఫ్ షేర్ చేసుకోవాలని వుందట. ఏ విష యం డిసైడ్ చేసుకుని చెప్పాలట. అతను కుమక ప్రపోజ్ చేయక పోయుంటే నాకతనంటే ఇష్టమైనా నేనేమీ చెప్పేదాన్నికాదు, అదే- నా అహం నన్నలా చెప్పనిచ్చేదికాదు. కామ్‌గా మీరు చూసిపెట్టిన వ్యక్తినే చేసుకుని వివాహ జీవితం మొదలు పెట్టి ఉండేదాన్ని. అంటే ఇప్పుడు మీరొప్పుకోకపోయినా అతన్నే చేసుకుని మిమ్మల్ని దూరం చేసుకుంటానని అర్థంకాదు నాన్నా. మిమ్మల్ని బాధపెట్టే ఆలోచన ఎందుకో నాకిష్టంగా వుండదు. మాకంటే ఎక్కువగా ఎవరూ అన్పించరు. నాకసలు మ్యారేజ్ కాకపోయినా నేను పోగొట్టుకొనేదేం లేదు. కానీ మిమ్మల్ని హర్ట్ చేయటం అభిమతం కాదు. నాకిదేం పెద్ద సమస్య కూడా కాదు. మీరు కాదంటే, మీరు చెప్పిన వ్యక్తితోనే నా జీవితం. ఇతన్ని మర్చిపోలేను అనే పెద్ద డైలాగ్‌లేమీ లేవు. ఎందుకంటే కాలంతో పాటూ అన్నీ వెనక్కి పోతాయని పూర్తిగా తెలుసున్నదాన్ని.

మరలా అయితే యిదంతా ఎందుకని మీరడగవచ్చు. లైఫ్ ఎవరితోనో ఒకరితో షేర్ చేసుకోక తప్పదు. ఎందుకంటే మీరెలాగూ నాకు మ్యారేజ్ చూస్తున్నారు. ఆ వ్యక్తి ఎవరో ఒకరు కాకుండా నన్నర్థం చేసుకునేవాడూ, ప్రేమించేవాడు అయితే బావుంటుందను కోవటంలో తప్పేముంది. పోనీ కనీసం ఆసక్తి చూపిస్తున్నాడు చాలు. అతను లేకపోతే నేనేం బ్రతకలేకపోను. కానీ ఏదో అసంతృప్తిగానే అన్పిస్తుంది. ఎలాగోలా బ్రతికేయటాని కయితే యింత ప్రయత్నమెందు కన్పిస్తుంది. ఎంతైనా అతను లేని జీవితం వెలితిగానే వుంటుంది. ముందే చెప్పినట్లు అతనంటే నాకిష్టం. ఎంతంటే, అతనితో జీవితం పంచుకోవాలన్పించేంత. నేను దీన్నే ప్రేమం టున్నాను. మరి మీరేమంటారు? నేనేం చేయాలో, నన్నేం చేయమంటారో మీరే చెప్పాలి. ఎందుకంటే నాయీ జీవితం మీరిచ్చిందే! ★